
జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..


WWW.DASHANEWS.COM
శుక్రవారం 21 11 2025
సంపుటి 1 సంచిక 1
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195

విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు
7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



**మిర్చి రైతు కంట కన్నీరు**

కొండంత ఆశలు పెట్టుకొని సాగు చేస్తున్న ఎర్రబంగారం పంట తెగుళ్ల బారిన పడి మూడు రోజుల్లో చెట్టు ఎండిపోతుంది, ఎకరాల కొద్ది పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, 2



**ఇక నుంచి హైస్పీడ్ జర్నీలు**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల వేగం గంటకు 130 కిలోమీటర్లకు పెరగనుంది. దీనికోసం రూ.3,200 కోట్లతో ట్రాక్‌లపైకి పాదచారులు, పశువులు, వాహనాలు రాకుండా ఈ-ఫెన్సింగ్, గోడల నిర్మాణం చేపట్టారు. 4



**సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్**

బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. 4

## ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్?



- ఓటర్ల జాబితాల సవరణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- ఓటర్ల జాబితాను రెడీ చేసేందుకు చర్యలు
- డిసెంబర్ రెండో వారం నుంచి నెలలో మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం
- సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు మూడు దశల్లో..

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల సవరణకు ప్రత్యేక కార్యాచరణ ప్రకటించింది. ఈ కార్యాచరణ నవంబర్ 20 నుంచి 23 వరకు 4 రోజుల పాటు జరిగేలా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈలోపుల ఓటర్ల జాబితాల్లో లోపాలను సరిచేసి, కొత్త ఓటర్లను చేర్చి .. పారదర్శకమైన ఓటర్ల జాబితాను రెడీ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపింది. ఈ ప్రకటనతో పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ రెండో వారంలో నిర్వహించడానికి ప్రక్రియ ప్రారంభించినట్లయింది. ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ నవంబర్ 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాలు, తప్పులు సరిదిద్దడం వంటివి చేస్తారు. ఇరవయ్యో తేదీన ఓటర్లు తమ గ్రామ పంచాయతీ కార్యాలయాలు, బూత్ లెవల్ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త ఓటర్లు 18 ఏళ్లు పూర్తి చేసినవారు, పేరు తప్పులు, అడ్రస్ మార్పులు, మరణించినవారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై దరఖాస్తులు చేసుకోవచ్చు. ఓటర్ల జాబితా అభ్యంతరాలు పరిష్కరణ ఇరవై రెండోతేదీన ఉంటుంది. ఈ రోజు బూత్‌లెవల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. అర్హత తనిఖీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఈ దశలో జరుగుతాయి. నవంబర్ 23న చివరి ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్ స్టేషన్లు ధృవీకరణ ఉంటుంది. సవరించిన ఓటర్ల జాబితాలు ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. ఈ ప్రక్రియలో ఓటర్లు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వంటి డాక్యుమెంట్లు సమర్పించాలి. ఆన్‌లైన్‌లో కూడా (tsvs.eci.gov.in) దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు, "ఈ సవరణ ద్వారా 1819 ఏళ్ల యువతను, మహిళలను మావట జాబితాల్లో చేర్చి, ఎన్నికల పారదర్శకతను పెంచుతాము" అని తెలిపారు.

ఈ కార్యాచరణ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో జరుగుతుంది. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించే అవకాశం ఉంది. ప్రతి దశ మధ్య గరిష్ఠంగా ఐదు రోజుల వ్యవధి ఉంటుంది. ఈ మేరకు, డిసెంబర్ రెండో వారం నుంచి నెలలో మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. ఎన్నికలు పార్టీ సింబల్స్ లేకుండా (నాన్ పాలిటికల్) జరుగుతాయి, కానీ పార్టీలు తమ మద్దతును అభ్యర్థులకు అందించవచ్చు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే 42 శాతం బీసీ కోటాను అమలు చేస్తామని ప్రకటించింది.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే తాట తీస్తాం: సీపీ సజ్జనార్



**దశ, హైదరాబాద్:** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను సీపీ సజ్జనార్ ఖండించారు. తెలంగాణలో విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరికైనా దాడులు చేయడం, బెదిరింపులకు దిగడం లేదా వారి విధులకు ఆటంకం కలిగించడం తీవ్రమైన నేరమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవలి ఘటనలను దృష్టిలో ఉంచుకొని, చట్టం ముందు అందరూ సమానులని, ప్రభుత్వ యంత్రాంగం పనిచేయడాన్ని అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది సహా ఏ ప్రభుత్వ

..మిగతా 4వ పేజీలో →

## కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పనిలేదు

కేటీఆర్ పై విచారణకు గవర్నర్ అనుమతి: బీజేపీ, కాంగ్రెస్‌పై కవిత ఫైర్



**దశ, హైదరాబాద్:** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీకి రాష్ట్ర గవర్నర్ అనుమతి ఇవ్వడంపై ఆయన సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇతరుల పై కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పని లేదని ఆమె ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ వైఫల్యం కారణంగా బస్తీల్లో ప్రజల ముఖం చూసే ధైర్యం కూడా కాంగ్రెస్ నేతలకు లేదని విమర్శించారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్ష నేతలపై కుట్రపూరితంగా కేసులు

..మిగతా 4వ పేజీలో →

## సౌదీ బాధిత కుటుంబాలకు కేటీఆర్ పరామర్శ

**దశ, హైదరాబాద్:** సౌదీ అరేబియాలో ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన యాత్రికులు దుర్మరణం పాలైన సందర్భంలో, వారి కుటుంబాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి మహమ్మద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు ముఠా జై సింహ, కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన అనంతరం కేటీఆర్ గారు మీడియాతో మాట్లాడుతూ ఈ దురదృష్టకర సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసి, మృతుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థించారు. మృతదేహాల తరలింపు లేదా ఇతర అవసరమైన కార్యక్రమాల కోసం విదేశాంగ అధికారులతో స్వయంగా మాట్లాడతాం. మరణించిన వారి పట్ల పూర్తి శ్రద్ధ తీసుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక బృందాన్ని ఇప్పటికే సౌదీ అరేబియాకు పంపాము. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ పూర్తిగా సిద్ధంగా ఉందని అన్నారు..



## 130 మందికి ప్రమోషన్లు..

**పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు శుభవార్త.**

**దశ, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌కు మోక్షం కల్పిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో సుమారు 140 మందికి పైగా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది.వివరాల్లోకి వెళితే.. రాష్ట్రంలోని గ్రేడ్1 పంచాయతీ కార్యదర్శులకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. 2018 కంటే ముందు ప్రమోషన్ పొందిన వారికి 10 శాతం కోటా కింద ఇప్పుడు సూపరింటెండెంట్లుగా అవకాశం ఇచ్చారు. రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్ల పరిధిలో అర్హులైన 9 మందికి పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్, ఆర్డీ) శాఖ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.అలాగే, పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న 130 మందికి పైగా సీనియర్ అసిస్టెంట్లకు ఒకేసారి సూపరింటెండెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తెలంగాణ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత మంత్రులకు వారు ధన్యవాదాలు తెలిపారు.



## ఐ బొమ్మ రవిని ప్రశ్నిస్తున్న పోలీసులు

**దశ, హైదరాబాద్:** ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. అతడిని బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పైరసీ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇమంది రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.ఈ కేసులో అతని నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సైబర్ క్రైమ్ పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి ఐదు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చారు.భారతీయ భాషల్లోని 21 వేల సినిమాలను పైరసీ చేసిన రవిని నగర సైబర్ క్రైమ్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకుని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్‌లలో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా, 50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు



## అర్బన్ నక్సలైట్ల వద్ద రూ. కోట్లు

**దశ, హైదరాబాద్:** అర్బన్ నక్సలైట్లు చిన్న పిల్లలు తుపాకులు పట్టుకొని అడవులకు వెళ్లమని రెచ్చగొడుతున్నారని బిజెపి కేంద్రమంత్రి బండిసంజయ్ తెలిపారు. అర్బన్ నక్సలైట్లు పట్టణాల్లో ఎసి గదుల్లో కూర్చుని ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కార్లలో తిరుగుతూ సొంత పైరవీలు చేసుకుంటూ కోట్లు సంపాదిస్తున్నారని, అర్బన్ నక్సలైట్లు తమ మాటలతో యువతను, మిగతా వారిని లొంగిపోవాలని చెప్పకుండా రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధిని అడవుల్లో ఉన్నవారు కూడా గ్రహించారని, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రాసిక్యూషన్ కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతిపై కాంగ్రెస్ ఏం చెప్తుందని బండి ప్రశ్నించారు. బిఆర్ఎస్, బిజెపి ఒకటే అని విమర్శించిన సిఎం రేవంత్ ఇప్పుడు ఏం మాట్లాడతారని, ఇన్నాళ్లు గవర్నర్ అనుమతి ఇవ్వొద్దనే సిఎం రేవంత్ రెడ్డి కోరుకున్నారని ధ్వజమెత్తారు. గవర్నర్ అనుమతి ఇచ్చారు కదా అని ఇప్పుడు సిఎం ఏం చేస్తారో చూడాలని అన్నారు. అవినీతిపరుల ఆస్తుల జప్తు చేస్తానని గతంలో రేవంత్ రెడ్డి అన్నారని బండిసంజయ్ పేర్కొన్నారు.

## పిస్తా హౌస్ యజమానింట్లో కోట్ల అక్రమ నగదు గుర్తింపు

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ 'పిస్తా హౌస్' యజమానింట్లో కోట్ల కొలదీ నగదు ఐటీ అధికారుల తనిఖీలో గుర్తించారు. పన్నుల ఎగవేత ఆరోపణలతో ఏకకాలంలో సోదాలు జరిగిన విష్యం తెలిసిందే. పిస్తాహౌస్ యజమాని నివాసంలో రూ.5 కోట్ల నగదు గుర్తించారు. నిన్న ఉదయం నుంచి దాదాపు 35 బృందాలు నగరంలోని 30కి పైగా ప్రాంతాల్లో ఈ సోదాలు నిర్వహించాయి. హోటళ్లలో జరిపిన తనిఖీల్లో వ్యాపార లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలతో పాటు, పెద్ద సంఖ్యలో హార్డ్ డిస్క్‌ను అధికారులు సీజ్ చేశారు. ముఖ్యంగా ఆన్లైన్ ఫుడ్ డెలివరీ యాప్ల ద్వారా వచ్చే ఆర్డర్లకు, సంస్థ చూపిస్తున్న లెక్కలకు మధ్య భారీ తేడాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మూడు హోటళ్లలోనూ ఆన్లైన్ ఆర్డర్లకు సంబంధించిన సరైన వివరాలు లేకపోవడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కులలోని సమాచారం ఈ కేసు దర్యాప్తులో కీలకం కానుందని, పూర్తి విశ్లేషణ తర్వాత పన్ను ఎగవేత ఏ స్థాయిలో జరిగిందనే దానిపై స్పష్టత వస్తుందని ఐటీ వర్గాలు భావిస్తున్నాయి.


దశ
నిజం.. నిర్భయంగా..

04
శుక్రవారం
21-11-2025
WWW.
DASHANEWS
.COM



## టెక్మాల్ ఎస్సై అరెస్టు.. స్పందించిన డీజీపీ

**దశ, హైదరాబాద్:** డబ్బులకోసం దుర్మార్గాలకు పాల్పడి ప్రజలను హింస పెట్టిన టెక్మాల్ ఎస్సై అరెస్టుపై తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. అవినీతిపరులైన ఎస్సైపై శీఘ్రంగా చర్యలు చేపట్టినందుకు.. అరెస్ట్ చేసినందుకు అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఎస్సైని అవినీతి కేసులో అరెస్ట్ చేసి చర్యలు తీసుకున్న వైనంపై ప్రజలనుండి వస్తున్న స్పందనను పోలీస్ శాఖలోని ఉద్యోగులు పైస్థాయి అధికారులు కూడా అర్థం చేసుకోవాలని.. మన నుండి పారదర్శకతతో జవాబుదారీతనంతో కూడిన పనితనాన్ని ప్రజలు కోరుకుంటున్నట్లుగా వారి స్పందన తెలియచేస్తోందని అన్నారు.. అవినీతిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని డీజీపీ స్పష్టం చేసారు.




# ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్

# సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్

### బస్సు కదులుతుంటే ఆటోమేటిక్‌గా డోర్స్ క్లోజ్ . ప్రయోగాత్మకంగా 45 'గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్' ఎలక్ట్రిక్ బస్సుల సిద్ధం

**దశ, హైదరాబాద్:** బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, కదులుతుంటే ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రత కోసం ఈ వినూత్న మార్పులు చేశారు. ఈ కొత్త బస్సులు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.హైలైట్:ఫుట్‌బోర్డు ప్రయాణాలు, ప్రమాదాలకు చెక్బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు, కదులుతున్న బస్సుల నుంచి దిగడం వంటి ప్రమాదకర విన్యాసాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న మార్పులు చేపట్టింది. ప్రయాణికుల, ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో అత్యాధునిక హైడ్రాలిక్ ఆటోమెటిక్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. స్టేజీ వద్ద బస్సు పూర్తిగా ఆగినప్పుడు మాత్రమే ఈ డోర్లు తెరుచుకుంటాయి. బస్సు కదులుతున్నప్పుడు లేదా వేగంగా ఉన్నప్పుడు ఇవి ఆటోమెటిక్‌గా మూసుకుని లాక్ అవుతాయి. దీనివల్ల ప్రయాణికులు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కడం, కదులుతున్న బస్సు నుంచి దిగిపోవడం లేదా ఫుట్‌బోర్డుపై వేలాడటం కుదరదు. ఈ వ్యవస్థ విమానాశ్రయ బస్సులు (ఏసీ ఇంద్ర), హైఎండ్ డీలక్స్ బస్సుల్లో ఉండే సాంకేతికత తరహాలో పనిచేస్తుంది. యినగరంలో జరిగిన ప్రమాదాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్లే జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న మార్గాలపై దృష్టి సారించారు. ప్రయోగాత్మకంగా హయత్‌నగర్2 డిపో పరిధిలో 45 'గ్రీన్ మెట్రో ఎక్స్‌ప్రెస్' ఎలక్ట్రిక్ బస్సులను సిద్ధం చేశారు. ప్రస్తుతం 10 బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయి. ముఖ్యంగా విద్యార్థులు అధికంగా ప్రయాణించే హయత్‌నగర్,



ఇబ్రహీంపట్నం మార్గాల్లో ఈ హైడ్రాలిక్ డోర్ వ్యవస్థ ఉన్న బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. హకీంపేట కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లు రాగానే.. మిగిలిన 35 బస్సులు కూడా త్వరలో తిరగనున్నాయి. డిసెంబరు నాటికి మరిన్ని ఈబస్సులు ఈ మార్గాల్లో అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఒక్కొక్కటి సుమారు 60 మంది ప్రయాణికులు సౌకర్యవంతంగా కూర్చుని లేదా నిలబడి ప్రయాణించేలా రూపొందించబడ్డాయి. వీటి ద్వారా ఆక్యుపెన్సీ పెరుగుతుందని డిపో అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్ - ఉప్పల్, కోఠి - రామంతాపూర్, మెహిదీపట్నం - ఆరాంఘర్, ఎల్బీనగర్ - ఇబ్రహీంపట్నం, ఉప్పల్ - ఘట్‌కేసర్ మార్గాల్లో విద్యార్థులు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. కాబట్టి ఇక్కడ ఈ కొత్త బస్సులను అత్యధిక సంఖ్యలో ప్రవేశపెట్టడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా అరికట్టవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త భద్రతా చర్యల వల్ల ఫుట్‌బోర్డు ప్రమాదాలు తగ్గుతాయని.. ప్రయాణం సురక్షితంగా మారుతుందని ఆర్టీసీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే తాట తీస్తాం: సీపీ సజ్జనార్

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నప్పుడు వారిని అడ్డుకోవడం, మాటల బెదిరింపులకు దిగడం, దాడి చేయడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలని.. ఈ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై భారత న్యాయ సంహిత (BNS)లోని 221, 132, 121(1) సెక్షన్ల కింద వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. అవసరమైతే హిస్టరీ షీట్లు కూడా తెరుస్తాం అని ఆయన ఎక్స్ వేదికగా వార్నింగ్ ఇచ్చారు.ఒక్కసారి అయినా ఇలాంటి కేసు నమోదైతే అది వ్యక్తి భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. "ఒక కేసు జీవితాన్నే మార్చేస్తుంది. పాస్‌పోర్ట్ జారీకి సమస్యలు వస్తాయి, ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశాలు తగ్గిపోతాయి, జీవితాంతం ప్రతికూల ప్రభావాల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. క్షణికావేశంలో చేసే ఒక తప్పు.. భవిష్యత్ మొత్తాన్ని అంధకారంలోకి నెట్టేస్తుంది" అని సజ్జనార్ తీవ్రంగా హెచ్చరించారు.ప్రభుత్వ అధికారుల భద్రత, గౌరవం, వారి విధులకు రక్షణ కల్పించడం పోలీసుల బాధ్యత అని సీపీ చెప్పారు. ప్రజలు వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, అధికారుల విధులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలిగించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పనిలేదు

మొదటి పేజీ తరువాయి

పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. దేశంలో ప్రస్తుతం కుట్రపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, అందుకు తెలంగాణలోనే అనేక ఉదాహరణలు ఉన్నాయని కవిత అన్నారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దేశంలో చట్టం, న్యాయం ఉన్నాయని గుర్తుచేశారు. ఈ రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తాము నంబర్ వన్ అయితే, మిగతా వాళ్లంతా 2, 3, 4 స్థానాల్లోనే ఉంటారని ఆమె వ్యాఖ్యానించారు.

### వినయం, భక్తి, సాధనకు ప్రతీక

## "పోలీ స్వర్గం నోము"

స్త్రీలు శతాబ్దాలుగా భక్తి, నమ్మకంతో ఆచరిస్తూ వస్తున్న పవిత్ర నోముల్లో "పోలీ స్వర్గం నోము"కు ప్రత్యేక స్థానం ఉంది. గ్రామీణ సాంప్రదాయాల నుంచి పుట్టుకొచ్చిన ఈ నోము, నేటికీ స్త్రీలలో అదే శ్రద్ధను, ఆధ్యాత్మికతను రేకెత్తిస్తోంది.

పురాణోక్త జానపద శైలిలో వినిపించే ఈ కథలో, దైవభక్తి ముందు అహంకారానికి చోటులేదనేసందేశం స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. ఒక మారుమూల గ్రామానికి చెందిన రజక స్త్రీ ఐదుగురు కోడళ్లలో చిన్నది 'పోలమ్మ', చిన్నప్పటి నుంచే దైవభక్తి పరవశంతో గడుపుతుండేది. పువ్వులు కోయడం, పూజలు చేయడం, దేవాలయ దర్శనం— ఇవే ఆమె జీవితం.

కానీ పెళ్లి తర్వాత పరిస్థితి మారింది. ఆమె అత్తకు తానే పెద్దభక్తురాలు అన్న గర్వం ఎక్కువ. కోడలైన పోలమ్మ పూజలు చేస్తే తన పేరుకు నష్టం జరుగుతుందని భావించి, ఆమెను ఇంటి పనులతో పట్టిపీడించి పూజలకు అవకాశం లేకుండా చేసేది. మిగతా కోడళ్లను మాత్రం దేవాలయాలకి తీసుకెళ్లేది.

ఓ కార్తీక అమావాస్య రోజు కూడా పోలికి పూజా సామగ్రి లేకుండా ఇంటి పనులు అప్పగించి, అత్త తన కోడళ్లతో నదీ స్నానానికి వెళ్లింది. కానీ పోలమ్మ నిరుత్సాహపడలేదు. బావి వద్దే స్నానం చేసి, పత్తి చెట్టు నుంచి పత్తి




తీసి వత్తులు తయారు చేసి, ఇంట్లో ఉన్న కవ్వం వెన్నతో దీపాన్ని వెలిగించి భక్తితో ప్రార్థించింది.

పోలమ్మ భక్తికి మెచ్చిన దైవం ఆమె కోసం పుష్పకవిమానాన్ని పంపింది. ఊరు జనం చూస్తుండగా పోలమ్మ ఆ విమానంలో ఎక్కింది. విమానం లేవుతున్నప్పుడే అత్త తన దురహంకారంతో పోలమ్మ కాళ్లు పట్టుకుని దిగదీయడానికి ప్రయత్నించగా, మిగతా కోడళ్ళు కూడా ఒక్కొక్కరు ఒకరి కాళ్లు పట్టుకుని వేలాడుతూ వచ్చారు. వారి అహంకారాన్ని చూసిన దేవతలు వారిని విమానం నుంచి కిందకు జారవిడిచారు. భక్తి, పవిత్రతతో నిలిచిన పోలమ్మ మాత్రం బొందిగా స్వర్గానికి చేరుకుంది. ఆ సంఘటన నుంచి ప్రారంభమైన ఈ నోము, నేటికీ ఆశ్వయుజ అమావాస్య నుంచి కార్తీక అమావాస్య వరకు ప్రతిదినం బ్రహ్మీ ముహూర్తంలో నదీ స్నానం చేసి, దీపం వెలిగించి, పోలమ్మ కథను పఠించడం ద్వారా స్త్రీలు ఆచరిస్తున్నారు.

## ఇక నుంచి హైస్పీడ్ జర్నీలు

**దశ, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల వేగం గంటకు 130 కిలోమీటర్లకు పెరగనుంది. దీనికోసం రూ.3,200 కోట్లతో ట్రాక్‌లపైకి పాదచారులు, పశువులు, వాహనాలు రాకుండా ఈఫెన్సింగ్, సరిహద్దు గోడల నిర్మాణం చేపట్టారు. అత్యధిక రద్దీ మార్గాల్లో ఫెన్సింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ.. ప్రజల సౌకర్యార్థం సబ్‌వేలు కూడా నిర్మిస్తున్నారు. ట్రైన్ ప్రయాణికులకు గుడ్‌న్యూస్. ఇక నుంచి మీ ప్రయాణాలు హైస్పీడ్‌తో సాగనున్నాయి. దక్షిణ మధ్య రైల్వే (SCR) పరిధిలోని గోల్డెన్ క్వాడ్రిలేటరల్, గోల్డెన్ డయాగోనల్, హైడెన్సిటీ మార్గాల్లో రైళ్లను గంటకు 130 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో నడపడానికి ఆమోదం లభించింది. ఈ వేగంతో రైళ్లను నడిపేందుకు వీలుగా.. రైల్వే ట్రాక్‌లపైకి పాదచారులు, పశువులు, వాహనాలు రాకుండా అరికట్టేందుకు ఒక భారీ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. అందుకు ఈఫెన్సింగ్, సరిహద్దు గోడల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,200 కోట్లు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 4,429 కి.మీ మేర పనులు చేపట్టనున్నారు. అందులో 4,019 కి.మీ మేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయనుండగా.. అంచనా వ్యయం రూ.2,055.52 కోట్లు. 410 కి.మీ మేర సరిహద్దు గోడల నిర్మాణం చేపట్టనునండగా.. అంచనా వ్యయం ₹1,136 కోట్లు. ఇప్పటివరకు, అన్ని డివిజన్లలో కలిపి 875 కి.మీ మేర ఫెన్సింగ్ పనులు పూర్తయ్యాయి. ఈ ఫెన్సింగ్ తక్కువ ఖర్చుతో బలంగా, సులభంగా ఏర్పాటు చేయడానికి వీలుగా ఉంటుందని అలాగే ఓవర్‌హెడ్ ఎలక్ట్రికల్ పరికరాల నుండి వచ్చే




ప్రేరణ విద్యుత్తు నుండి సురక్షితంగా ఉంటుందని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు.

ట్రాక్‌లపైకి అనధికార ప్రవేశాలను పూర్తిగా అడ్డుకుంటూనే, ట్రాలీలు, రైల్వే పరికరాలను దించడానికి తగిన ఖాళీని ఉంచుంతున్నట్లు తెలిపారు. అత్యధిక రద్దీ ఉండే మార్గాల్లో ఫెన్సింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సికింద్రాబాద్ కాజీపేట, కాజీపేట బల్లార్షా, విజయవాడ కొండపల్లి, గూటి వాడి ప్రాంతాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సౌకర్యార్థం నివాస ప్రాంతాలు, స్టేషన్ల సమీపంలో పాదచారులు, పశువులు, చిన్న వాహనాలు సురక్షితంగా ట్రాక్‌లను దాటేందుకు వీలుగా సబ్‌వేలు కూడా నిర్మిస్తున్నట్లు చెప్పారు.

సికింద్రాబాద్ కాజీపేటబల్లార్షా, కాజీపేటకొండపల్లి మార్గాల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. విజయవాడ సెక్షన్‌లో పుల్లదువ్వాడ, గూడూరు కడవకుదురు, విజయవాడకొండపల్లి మార్గాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్ట్ వల్ల రైళ్ల వేగం పెరగడంతో పాటు, ట్రాక్‌లపై భద్రత మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## జగన్ వచ్చారు.. వెళ్లారు

**దశ, హైదరాబాద్:** ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత జగన్ హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ప్రాంగణంలోకి వెళ్లిన తర్వాత జగన్ తొలుత వెయిటింగ్ గదిలోకి వెళ్లారు. విచారణ ప్రారంభం కాగానే, కోర్టు సిబ్బంది 'ఏ1 వైఎస్ జగన్మోహన్ రెడ్డి' అని పిలిచారు. వెంటనే ఆయన కోర్టు హాల్లోకి ప్రవేశించి, న్యాయమూర్తికి నమస్కరించారు. అనంతరం, న్యాయమూర్తి సూచన మేరకు హాజరు పట్టికలో సంతకం చేశారు. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే జగన్‌ను కోర్టు నుంచి వెళ్లేందుకు జడ్జి అనుమతించారు. విచారణ సందర్భంగా జగన్ ను జడ్జి ఎలాంటి ప్రశ్నలు అడగలేదు. కేవలం ఆయన హాజరును మాత్రమే జడ్జి పరిగణనలోకి తీసుకుని, సంతకం చేయించుకుని పంపించి వేశారు. రాబోయే రోజుల్లో పిటిషన్లపై విచారణ జరగనుంది.ఈ కేసులో జగన్ తదుపరి విచారణకు ఎప్పుడు హాజరు కావాలనే అంశంపై న్యాయస్థానం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు, కోర్టు నుంచి బయటకు వచ్చిన జగన్, నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసమైన లోటస్ పాండ్‌కు వెళ్లారు. లోటస్ పాండ్ వద్దకు అప్పటికే పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు చేరుకున్నాయి. లోటస్ పాండ్ లోకి కేవలం కొద్ది మంది కీలక నేతలు మాత్రమే వెళ్లారు.

## కలెక్టర్ చేతుల మీదుగా విశ్వామిత్రకు ప్రశంసా పత్రం




**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** బాలల దినోత్సవంను పురస్కరించుకొని ఈనెల 14 నుండి 20 వరకు మహిళా శిశు దివ్యాంగుల వృద్ధుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలో భాగంగా గురువారం ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా వాక్ ఫర్ ట్రీస్ కాన్సెప్ట్ తో పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతిరోజు మొక్కలు నాటుతూ విశేష సేవలు అందిస్తున్నందుకుగాను చిరంజీవి విశ్వామిత్ర చౌహాన్ ప్రశంసా పత్రంతో పాటు మేమంటోను అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్నారిని అభినందిస్తూ భవిష్యత్తులో పచ్చదనం కోసం మరింత కృషి చేయాలన్నారు. ఇటీవల జాతీయ అవార్డు అందుకున్న కలెక్టర్ కి విశ్వామిత్ర చౌహాన్ మొక్కను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యాచందన, జిల్లా డీఈవో నాగలక్ష్మి, జిల్లా డిడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, షీటీం ఇన్స్పెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ శ్రేణులంతా ఏకమవ్వాలి: ప్రహ్లాద్ జోషీ

**దశ, నల్గొండ:** పార్టీ శ్రేణులంతా ఏకమై, అంకితభావంతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో ప్రతి బూత్‌లో బీజేపీ ముందంజలో నిలుస్తుందని కేంద్ర మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషీ విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు నిష్పక్షపాతంగా, స్పష్టంగా వివరించే బాధ్యత ప్రతి కార్యకర్తదేనని పేర్కొన్నారు. గురువారం నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకురావడానికి ముఖ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా ఎన్నికల ప్రభారి, మాజీ ఎంపీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడారు. ప్రతి బూత్‌లో ఓటర్లను చేరుకునే ప్రత్యేక కార్యక్రమాల అమలు పరచాలని, ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ వేదికగా పరిష్కారం కోసం చురుకైన చర్యలు చేపట్టాలని అన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంలో పార్టీ సిద్ధత, బూత్ మేనేజ్‌మెంట్, ప్రజల అనుసంధానం వంటి అంశాలపై కీలక సూచనలు చేశారు. సమావేశం లో మండల మరియు బూత్ స్థాయిల్లో ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. వీరేందర్ అధ్యక్షులుకార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPLANA, RNI Reg No. TGTEL/25/A4195.